# "మేడ్ ఫర్ ఈచ్ అదర్"

## -యర్రంశెట్టి శాయి

బ్యూటీస్ క్లబ్ వాళ్ళు "మేడ్ ఫర్ ఈచ్ అదర్" పోటీలు నిర్వహిస్తున్నారన్న వార్త మా ఊరంతా దావానలంలా వ్యాపించి పోయింది ఆ ఊళ్ళోని ఏ భార్యా భర్తల జంటయినా అందులో పాల్గొన వచ్చుననీ, ప్రవేశ రుసుం ఏమీలేదనీ. ఎన్నికయిన జంటకు మంచి నగదు బహుమతీ, ఆలిండియా టూరూ ఏర్పాటు చేయబడునని స్టేట్ బాంక్ దగ్గర గోడమీద అంటించిన ఓ పోస్టరులో చదివాను బజారునుండి అన్ని ఆఫీసులకు దారి అదే కావడంవల్ల నాతో పాటు మా ఆఫీసులోని స్టాఫంతా ఆ కాగితం చదివేశారు. ఆ రోజంతా అదే చర్చకూడా జరిగింది ఆఫీసులో. 'రెండు వేల రూపాయలు బహుమతంట" అన్నాడు రత్నారావు మొంటి పుకారు గాలిలోకి వదుల్తూ. రాజారావునీ. అతనిభార్యనూ మా ఆఫీసు తరపున ఆ పోటీలో పాల్గొనమని కోరారు కొంతమంది. వాళ్ళను బలపర్చిన వాళ్ళల్లో నేను ఒకణ్ని రాజారావు కాలేజివదలి క్రొత్తగా సర్వీసులో చేరిన యువకుడు. సరిగ్గా సంవత్సరం క్రితమే అతనికి వివాహమయింది. పెళ్ళికి మా ఆఫీసంతా హాజరయింది. అబ్సెంటూ-లేట్ లేకుండా పెళ్ళిలో అందరూ రాజారావునీ. అతని భార్యనూ చూసి 'చక్కని, అందమయిన జంట!" అని బోలెడు సార్లనుకొన్నారు అనుకొని వదలక ప్రక్కవాళ్ళతో కూడా అవుననిపించారు. నాకూ నిజమేననిపించింది. రాజారావుకి మంచి పర్సనాలిటీ ఉంది. మొఖాన్న ఎప్పుడూ చిరునవ్వుతప్పితే మరోభావం కనిపించదు. తెల్లని అతని ఫాలభాగంపై ముంగురులు ఎప్పుడూ పరిగెడతుంటే చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉండేది. అతని భార్య అతనికంటె అందంగా ఉంది.

అయితే మా ప్రపోజల్ విని ఏమీ ఉత్సాహం చూపకుండా మామూలుగానే చిరునవ్వు నవ్వి ఫైళ్ళు చూసుకోసాగాడు రాజారావు.

'ఏమంటావోయ్!" అన్నాన్నేను అంతటితో వదలక.

ఎందుకండీ; ఇవన్నీ.........నాకేమంత ఇష్టంలేదు........" అన్నాడు నాన్చుతూ.

"తప్పేముంది గురూ! అర్హతఉండీ

అలా దడుస్తా వెందుకూ? వాళ్ళు చూపే అందం, అన్యోన్యతా, ఆకర్షణ మీ ఇద్దరిలో బ్రహ్మాండంగా ఉన్నాయి. సాధారణంగా మీలాంటి భార్యా భర్తలు అరుదుగా కనిపిస్తారు. భర్త అందంగా ఉంటే భార్య వికారంగా ఉంటుంది. వైస్‌వర్సా ...మరి ఈ ఎడ్వాంటేజ్ ఎందుకు ఉపయోగించుకో కూడదు?...." రత్నారావు అడిగాడు,

"నామిసెస్‌ని కూడా కన్సల్ట్ చెయ్యాలండీ! ఆవిడ వస్తుకుంటుందో, వస్తుకోదో........" అన్నాడతను.

"భలేవాడి వోయ్! వప్పుకోడానికి ఇందులో ఏం తప్పుందనీ! ఒకవేళ వప్పుకోకపోతే మేమందరం వచ్చి నచ్చచెబుతాంలే. నువ్వు అందులో ఎన్నికయితే మన ఆఫీసుకే గర్వ కారణం కదుటోయ్!" అంటూ దబాయించాడు రమణ.

నేనూ, రమణా, మిగతా కొంతమందీకలసి రాజారావు ప్రమేయం లేకుండానే అతనిపేరు పోటీల్లో ఇచ్చేము

సత్తిరాజు తనూ పోటీ చేస్తానన్నాడు. ఎంచేతంటే తనూ వాళ్ళావిడా అందవికారంగా బావుంటారట


పోటీ రోజు రానేవచ్చింది. పోటీ చూడ్డానికొచ్చేవాళ్ళకు టిక్కెట్టు పెట్టడం చేత మా ఆఫీసునుంచి ఇద్దరు ముగ్గురం తప్పితే మిగతా వారెవ్వరూ రాలేదు,

పోటీ జంటలన్నీ అక్కడే గార్డెన్‌లో తిరుగుతున్నారు ఒకరినొకరు పలుకరించుకొంటూ. అదికూడా ఓ పరీక్షట రాత్రి ఎనిమిది దాటాక స్టేజిదగ్గరకు చేరుకొన్నారందరూ. ఒక్కొక్క జంటా స్టేజిమీద కనబడాలిట. మైకులో పేర్లు చదువుతున్నారు వరుసగా. నా భార్య జయ అందరినీ పరీక్షగా చూస్తూ తను స్వతంగా అందరికీ మార్కులు వేస్తోంది.

"ఏంటి మమ్మీ, సిన్మాకని ఇక్కడికి తీసుకొచ్చావ్?" అంటూ మా జానకి మారాం మొదలుపెట్టింది.

"ఏయ్! గొడవచెయ్యకు!" అన్నాను కోపంగా.

రాజారావూ, అతని భార్యా స్టేజిమీద కొచ్చారు. అంతవరకూ కనబడినవాళ్ళల్లో వీళ్ళదే పైచేయి అనిపించింది నాకు. మెల్లిగా జయ మార్కులపట్టీ వంక చూశాను. ఎనభై శాతం మార్కులేసింది. లిస్టులో అదే పెద్దమొత్తం. క్లబ్ శెక్రటరీ అంతా అయిపోయాక క్లబ్బుగురించీ, ఈ పోటీ ఏర్పాటుచేయడానికి తామెందుకు తలచుకొందీ, దీనికయే ఖర్చు ఎవరు భరిస్తోందీ, అంతా సవిస్తారంగా విన్నవించాడు. ఆ పోటీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినవారిని సభకు పరిచయం చేసి వారిని ఆ పోటీ ఫలితాలు తెలుపవలసిందిగా కోరాడు ఒక నిర్ణేత స్టేజిమీదకు వచ్చి రాజారావు పేరు చదివాడు. ఆ ప్రదేశమంతా చప్పట్లతో మార్మోగిపోగి




పోయింది.

రాజారావు, అతని భార్యా వేదికమీద కొచ్చి అందరికీ నమస్కరించారు.

"డాడీ! రాజారావు మామయ్య కదూ?" ఆశ్చర్యంగా అడిగింది జానకి.

"అవును!"

"మరి అక్కడ నుంచున్నాడెందుకూ?"

"అతను పోటీ గెలిచాడు!"

"ఏం పోటీ?"

"మేడ్ ఫర్ ఈచ్ అదర్!"

"అంటే?"

"అంటే...." బుర్ర గోక్కున్నాను. ఎలా చెప్పాలో తెలియలేదు.

"అంటే దేముడు వాళ్ళిద్దరినీ ఒకరి కోసం ఒకరిని సృష్టించాడు ...మామయ్యా కోసం అత్తయ్యనీ. అత్తయ్యకోసం మామయ్యనీ...."

ఇంకేదో చెప్పాలనుకొన్నాను గానీ ... కుదరలేదు. నా అవస్థ చూసి జయ నవ్వేసింది.

జానకికేమీ అర్థమయినట్లు లేదు. సిన్మాకెప్పుడెళ్దామంటూ మారాం మొదలు పెట్టింది.

"నే చెప్పలే! ఖచ్చితంగా వీళ్ళే గెలుస్తారనీ?" అంది జయ.

అందరూ రాజారావు దంపతులను అభినందిస్తున్నారు. నేనూ జయాకూడా వెళ్ళాము.

"ఏమోయ్! నే చెప్పలే! అవ్వే వద్దు సార్ అన్నావుగా! ఇప్పుడేమంటావ్?" అన్నాను నవ్వుతూ.

జవాబివ్వకుండా చిరునవ్వు నవ్వాడతను.

మర్నాడు మా ఆఫీసంతా చాలా కోలాహలంగా ఉంది. అందరూ రాజారావు కోసం ఎదురుచూస్తున్నారు.

"పార్టీ ఇవ్వాల్సొస్తుందని ఎగ్గొట్టలేదు గదా?" అనుమానంగా అన్నాడు

రమణ.

"ఎన్నాళ్ళని అలా తప్పించుకో గలడు!" సత్తిరాజు అన్నాడు.

ఆరోజు రాజారావు ఆఫీసుకి రాలేదు. ఆఫీసుకి లీవ్ లెటర్ పంపించాడు. అందరూ చాలా నిరుత్సాహపడిపోయారు.

"బహుశా వాళ్ళిచ్చిన చెక్ ఇవాళ 'కాష్' చేస్తున్నాడేమో!" అని సరిపెట్టు కొన్నారు కొంతమంది.

మర్నాడు అతను రావడంతోనే అందరూ చుట్టుముట్టేశారు కంగ్రాచ్యు లేషన్స్ అంటూ.

"అందరూ శేషగిరి హోటల్ కి పదండి! రాజారావు ఈ సంతోషమయిన సమయంలో అందరికీ ఘనమయిన పార్టీ ఇస్తాడు!" అంటూ అరిచాడు సత్తి రాజు.

అందరూ పొలోమని హోటల్లో దూరిపోయారు.

స్వీట్లు హాట్లు ఎగిరిపోయినయి.

బిల్లు చెల్లించి బయటపడ్డాడు రాజారావు.

ఆ పై ఆదివారంనుంచి టూర్ కి పంప డానికి క్లబ్ నిర్ణయించిందని తెలియజేశా డతను. భారత దేశంలోని అందమయిన ప్రదేశాలు రైల్లో తిరిగి చూడాలిట. ఫస్ట్ క్లాస్ ఛార్జీలు —మిగతా ఖర్చులూ—అంతా క్లబ్ వారిదే.

అతను టూర్ లో ఉన్నప్పుడే అతనికి ట్రాన్స్ఫర్ అయింది. అందరికీ చాలా విచారం కలిగింది అతను వెళ్ళిపోతున్నం దుకు. ఘనమయిన సెండాఫ్ పార్టీ ఏర్పాటుచేశారు. అతను వెళ్ళిపోయాం తర్వాత చాలా కాలంవరకూ ఎవ్వరికీ గుర్తులేదు. సంవత్సరం అవగానే తిరిగి బ్యూటీస్ క్లబ్ వారు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్ ' పోటీలు నిర్వహించారు. ఆరోజు అందరం రాజారావుని తలుచుకొన్నాం. ఆరోజే ఆఫీసు పనిమీద నేను విజయవాడ వెళ్ళటం తటస్థించింది రాత్రి అలంకార్ ఎయిర్ కండిషన్డ్ లో భోజనం చేసి బయటికొస్తూండగా రాజారావు లోపలి కొస్తూ ఎదురయ్యాడు.

"హలో రాజారావ్!" అన్నాను ఆనందంగా.

నన్ను కౌగలించుకొన్నంత పని చేశా డతను.

"ఏమిటోయ్ విశేషాలు!" అన్నాను.

"ఈమె ఎవరు!" అనడిగాను అతని ప్రక్కనే ఉన్న ఓ స్త్రీని ఉద్దేశించి. ఆమెను అంతకు ముందు నేను చూడ లేదు.

"అన్నట్లు మీకు పరిచయం చేయనే లేదు... రజనీ! ఈయన నేను మొదటి పనిచేసిన ఆఫీసులో హెడ్ క్లార్క్ పేరు విఘ్నేశ్వరరావు. ఈమె నా మిసెస్ సార్!"

"నమస్తే!" అందామె చిన్నగా.

నా కంతా అయోమయంగా ఉంది. మౌనంగా ఆమెకు ప్రతి నమస్కారం చేశాను.




"ఒక్కసారిటు వస్తావూ!" అన్నాను రాజారావుతో.

"మీ రడగబోయే దేమిటో నాకు తెలుసు నా అసలు భార్య సుందరి ఏమయిందా అని. ఇక్కడికొచ్చిన క్రొత్తలోనే ఇద్దరం విడాకులు తీసుకున్నాం సార్! మాకు పెళ్ళయిన దగ్గర్నుంచీ కూడా ఏమాత్రం సరిపడేది కాదు. ఎప్పుడూ కొట్లాటల్లోనే రోజులు గడుస్తుండేవి. ఏమయితేనేం, ఇద్దరం చదువుకొన్న వాళ్ళం కాబట్టి త్వరలోనే మేల్కొని విడిపోయాం. తర్వాత ఈ మధ్యనే రజనిని చేసుకొన్నాను...."

అతను సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

"నేను నడుస్తున్నానేగాని మనసు మనసులో లేదు. ఏదో అనుకోని సంఘటన జరిగినట్లు, అందులో నాకూ భాగమున్నట్లు అనిపించసాగింది.

"షేడ్‌ఫర్ ఈచ్ అదర్!" పోటీ గుర్తుకొచ్చింది నాకు. వెన్వెంటనే గట్టిగా నవ్వేశాను.